క్లుప్తంగా

సంపర సప్తాహాల్లో మహా పూర్ణాహుతి



మహా పూర్ణాహుతిలో పాల్గొన్న హనుమంతాచార్యులు, ఫణిశ్రీ దంపతులు

పెదపూడి: సంపర గ్రామంలోవారం రోజులుగా జరుగుతున్న 59వ శ్రీరామ సప్తాహాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఈ సప్తాహాల్లో భాగంగా ఉదయం 7.30 గంటలకు మహా పూర్ణాహుతి కార్యక్రమం జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం పండితులు గంగాధర్‌భట్ల విష్ణుశర్మ అధ్వర్యంలో పూజలు నిర్వహించారు. పండితులు ఖండవిల్లి హనుమంతాచార్యులు ఫణిశ్రీ దంపతులుయజ్ఞకర్తలుగా కూర్చొని మహా పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



రంగంపేటలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న నాయకులు

రంగంపేట: భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం మండలంలో ఘనంగా నిర్వహించారు. మండల బీజేపీ అధ్యక్షుడు మైలవరపు సాయిరామ్ ఆధ్వర్యంలో సింగంపల్లి, దొడ్డిగుంట, సుభద్రంపేట, వెంకటాపురం, రంగంపేట గ్రామాల్లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి శివరామకృష్ణంరాజు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మండవిల్లి గుప్తా, పోతుల వీరన్న, పెండ్యాల బుజ్జిబాబు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరించిన ఎమ్మెల్యే నల్లమిల్లి

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు వంతెన బీజేపీ జెండాను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆవిష్కరించారు. ఆదివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆవిష్కరించారు. ఎంపీపీ తేతలి సుమ, మాజీ జెడ్పీటీసీ పడాల రాము పాల్గొన్నారు.

కోరుకొండలో

కోరుకొండ: బీజేపీ మండలాధ్యక్షుడు అడపా సుధీర్ ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక బస్టాండ్ సెంటర్‌లో బీజేపీ జెండాను ఎగురవేశారు. నాయకులు తగరంపూడి గణపతి, మద్దిపాటి రజనీ, పెనగటి రాంబాబు, చీర్ల రాధాకృష్ణ పాల్గొన్నారు.

శివాలయం ప్రధాన అర్చకుడి మృతి



కొడమంచిలి శ్యామలరావు గురుస్వామి

సీతానగరం: స్థానిక ఉమారామలింగేశ్వరస్వామి వారి ఆలయ ప్రధాన అర్చకుడు కొడమంచిలి శ్యామలరావు గురుస్వామి (84) శనివారం రాత్రి మృతి చెందారు. ఈయన సుమారు 42 ఏళ్ల స్వామి అయ్యప్ప మాలాధారణ వేసి, గురుస్వామిగా ఉన్నారు. మండల ప్రజలకు స్వామి అయ్యప్ప మాలాధారణ పరిచయం చేసిన ఘనత ఈయనకు దక్కింది. వంశపారపర్యంగా వచ్చిన ఆలయ అర్చకులుగా ఉమా విశ్వేశ్వరస్వామి, ఉమా రామలింగేశ్వరస్వామి వార్లకు సేవలు అందించారు. ఈయన మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



శ్రీరంగపట్నంలో స్వచ్ఛ భారత్‌లో పరిసరాలను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

కోరుకొండ: పర్యావరణం పరిరక్షణ–పరిసరాల పరిశుభ్రత సమాజంలోని సభ్యులంతా బాధ్యతగా భావించాలని రాజమహేంద్రవరం వ్యవసాయ కాలేజీ ఎన్‌ఎస్‌ఎస్ అధికారి డాక్టర్ సునీత అన్నారు. ఆదివారం కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ కాలేజీ విద్యార్థులు గ్రామంలోని ప్రధానకూడళ్లు, రోడ్లు శుభ్రపర్చారు. వారం రోజులుపాటు నిర్వహించే కార్యక్రమంలో భాగంగా 3 వరోజు ఆదివారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో స్వచ్ఛ భారత్ ర్యాలీ నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు డి.సత్యనారాయణ, స్థానిక నాయకులు మద్దాల రమణ పాల్గొన్నారు.

వివాదాస్పదంగా దివాన్ చెరువు ఫ్లై ఓవర్

- మార్కింగ్‌లో తేడాలొచ్చాయంటున్న బాధితులు
- ఇచ్చిన పరిహారం కంటే మూడు రెట్లు భూసేకరణ
- కూల్చివేత పనులకు బ్రేక్
- నేడు మార్కింగ్‌లను నిర్ధారించేలా రీ సర్వే



దివాన్‌చెరువులో చేపట్టిన కూల్చివేత పనులు



మార్కింగ్‌లో తేడాలున్నాయంటూ ఆందోళనకు దిగిన బాధితులు

రాజానగరం: జాతీయ రహదారిపై దివాన్‌చెరువు సెంటర్‌లో ఫ్లై ఓవర్ నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణ వివాదాలకు తావిస్తోంది. రోజురోజుకూ పెరుగుతున్న జన సాంద్రత, వాహనాల రద్దీ, తద్వారా జరుగుతున్న ప్రమాదాలను నివారించడానికి జొన్నాడ, మోరంపూడిలలో నిర్మాణం చేపట్టిన ఫ్లై ఓవర్లతోపాటే దివాన్‌చెరువులో కూడా ఫ్లై ఓవర్ నిర్మాణానికి ప్రతిపాదించారు. అందుకు కేంద్ర ప్రభుత్వం కూడా గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ప్రస్తుతం ఉన్న నాలుగు లేన్ల రహదారికి ఇరువైపులా సబ్‌వేల నిర్మాణం కోసం అవసరమైన స్థలాన్ని సేకరించారు. ఇందుకుగాను సర్వే చేసి, సంబంధిత భూ, గృహ యజమానులకు 2018లోనే పరిహారం కూడా చెల్లించారు. అయితే ఆ సమయంలో భూ సేకరణకు పెట్టిన మార్కింగ్‌ని దాటి ప్రస్తుతం భూసేకరణ పనులకు అధికారులు సిద్ధమవడం వివాదానికి కారణమైంది.

ఒకే స్థలానికి రెండు, మూడు మార్కింగ్‌లు

2018లో పరిహారం మొదట పెట్టిన మార్కింగ్ ప్రకారం చెల్లించారు. ఆ తరువాత రెండేళ్ల క్రితం మళ్లీ వచ్చి ఇంకోమారు మార్కింగ్ చేశారు. కొన్నిచోట్ల ఈ మార్కింగ్‌లు రెండు, మూడేసి కూడా ఉన్నాయి. ఆ సమయంలో సంబంధిత స్థల యజమానులు అధికారులను ఇదేమిటని ప్రశ్నిస్తే తీసుకున్న స్థలానికి పరిహారం చెల్లించాకనే పనులు చేపడతారని బదులిచ్చారు. దానితో అప్పట్లో ఈ మార్కింగ్‌లపై స్థానికులు పెద్దగా దృష్టి పెట్టలేదు. అయితే ప్రస్తుతం ఆ మార్కింగ్‌ల ప్రకారం స్థలాలను స్వాధీనం చేసుకుంటూ, వాటిలో ఉన్న నిర్మాణాలను తొలగిస్తుండటంతో వాటి యజమానులలో కలకలం రేగింది. కూల్చివేతను అడ్డుకునే ప్రయత్నం చేశారు. బాధితులంతా కలిసి దివాన్‌చెరువు సెంటరులోని లక్ష్మీగపతి ఆలయం వద్ద ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఎన్‌హెచ్ విభాగం ఇంజినీరింగ్ అధికారులు స్పందించి, ఆందోళన చేస్తున్న వారిని కలుసుకుని, కూల్చివేత పనులు ఏవిధంగా ప్రారంభమయ్యాయో వివరించారు. స్థల సేకరణకు సర్వే చేసిన అనంతరం రెవెన్యూ అధికారులు మార్కింగ్ చేసి, అప్పగించిన మేరకు ప్రస్తుతం స్థల సేకరణ పనులు చేపట్టామన్నారు. ఇదే విషయాన్ని అక్కడి నుంచే ఫోన్ ద్వారా రాజమహేంద్రవరం ఆర్డీటకు తెలియజేశారు. దీంతో సోమవారం రీ సర్వే చేసి, అందరికీ న్యాయం చేసేందుకు సమ్మతించారు.

నేడు రీ సర్వే - సరిచూసుకోండి



దివాన్‌చెరువు ఫ్లై ఓవర్ నిర్మాణానికిగాను సేకరించిన స్థలాలలో ఉన్నతాధికారుల ఆదేశాలను అనుసరించి ఎన్‌హెచ్ విభాగం సర్వేయర్స్ ద్వారానే సోమవారం రీ సర్వే చేపట్టనున్నాం. ఇందులో మండల సర్వేయర్ కూడా ఉంటారు. మార్కింగ్‌ల విషయమై వచ్చిన తేడాలను ఈ రీ సర్వే ద్వారా నిర్ధారణ చేసుకోవచ్చు. సంబంధిత వ్యక్తులు రీ సర్వే జరిగే సమయంలో తప్పనిసరిగా దగ్గర ఉంటే మంచిది. రీ సర్వే అనంతరం నివేదికను ఆర్డీఓకు అందజేస్తాం.

– జీఏఎల్ఎస్‌దేవి, తహసీల్దారు, రాజానగరం

పూర్తి పరిహారం చెల్లించే వరకు పనులను అడ్డుకుంటాం



నేషనల్ హైవే అథారిటీ తరఫున విస్తరణకు అనువుగా సర్వే చేసి, తీసుకున్న స్థలం మేరకు 2018లో మార్కింగ్ చేశారు. మాకు ఇక్కడ 300 గజాలుంటే 190 గజాలు తీసుకున్నారు. పరిహారం కూడా చెల్లించారు. ఆ తరువాత మరో మార్కింగ్ పెట్టారు. ఇప్పుడు మొత్తం ఇల్లంతా పోతుంది. అదేమని మార్కింగ్ పెట్టినప్పుడే అడిగితే అదనంగా తీసుకున్న స్థలానికి కూడా పరిహారం ఇస్తామన్నారు. కానీ ఇంతవరకు లేదు, సరికదా ఇప్పుడు కూల్చివేతకు సిద్ధమయ్యారు. మాకు ఇవ్వవలసిన పరిహారం పూర్తిగా చెల్లించిన తరువాతనే ఇందుకు సమ్మతిస్తాం, లేకుంటే అప్పటి వరకు పనులను అడ్డుకోకతప్పదు.

– దొడ్డా శ్యామ్‌కుమార్, దివాన్‌చెరువు

ఆంజనేయస్వామి గుడి అంతా పోతుంది



ఆంజనేయస్వామి గుడికి మొదట మార్కింగ్ పెట్టిన ప్రకారం విగ్రహాలకు నష్టం లేదు, గుడి కొంత భాగం పోతుంది. దీంతో ప్రస్తుతానికి గుడిలో ఉన్న విగ్రహాలను అలాగే ఉంచేసి, రాబోయే కాలంలో కొత్తగా గుడిని కట్టినప్పుడు విగ్రహాలను మారుద్దామనుకున్నాం. కానీ ఇప్పుడు మొత్తం గుడినే లేపేశాలావున్నారు. దీంతో ఆర్డీఓ కార్యాలయాన్ని సంప్రదిస్తే.. 2018లోనే గ్రామంలో ఆరు ఆలయాలకు పరిహారం మంజూరైందన్నారు. ఎవ్వరూ క్లెయిమ్ చేయక ఆ సొమ్ము అలాగే ఉంది. ఇప్పుడు వచ్చి తీసుకోవచ్చన్నారు. స్థల సేకరణకు పెట్టిన మార్కింగ్‌ల విషయం తేలిన తరువాత తీసుకుంటాం.

– యర్రంశెట్టి నాగేశ్వరరావు, దివాన్‌చెరువు

ధాత్రి ట్రస్ట్ సేవల విస్తరణకు కృషి

పెదపూడి: అనపర్తి మండలం రామవరం గ్రామంలో స్థానిక బాపనమ్మ ఆలయం వద్ద శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా భక్తులు, ప్రజలకు బెల్లపానకం పంపిణీ చేశారు. సబ్బెళ్ల సురేష్‌రెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ధాత్రి సహకారంతో బెల్లం పానకం పంపిణీ చేశారు. అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, ధాత్రి ట్రస్ట్ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి చేతుల మీదుగా పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ట్రస్ట్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టడానికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సబ్బెళ్ల తిరపారెడ్డి, పడాల సురేష్‌రెడ్డి, తమలంపూడి దుర్గారెడ్డి, కోనాల సత్రెడ్డి, కోనాల త్రినాథ్‌రెడ్డి, ట్రస్ట్ ఉపాధ్యక్షుడు పలుగం శివారెడ్డి, కార్యదర్శి చింతా ప్రభాకర్ రెడ్డి, నల్లమిల్లి వీర్రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

రంగంపేట: స్థానిక మంచినీటి చెరువు వద్ద కొలువైన లక్ష్మీగణపతి ఆలయ 13వ వార్షికోత్సవం ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మీగణపతి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని అందంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు. భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

బహుమతి అందజేత

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలోని జరుగుతున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను శనివారం రాత్రి మాజీ ఎమ్మెల్యే డాక్టర సత్తి సూర్యానారాయణరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా పోటీలో విజేతలకు అందించే రెండవ బహుమతి రూ.15,555 చెక్కును కమిటీ సభ్యులు అందించారు. వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కిలపర్తి సత్యనారాయణ పాల్గొన్నారు.

కనుల పండువగా కోదండరాముని కల్యాణం



జి.మామిడాడ కోదండ రామాలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి ఆదిలక్ష్మి దంపతులు



పందలపాకలో కల్యాణం జరిపిస్తున్న పైల శ్రీహరి కృష్ణ, అరుణకుమారి దంపతులు



కల్యాణంలో బియ్యం గింజలపై శ్రీరామ అని రాసిన బియ్యం గింజలను సమర్పిస్తున్న యువరాజారెడ్డి దంపతులు

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో అంగరంగ వైభవంగా శ్రీ కోదండరాముని సీతాదేవి కల్యాణం ఆదివారం జరిగింది. సుమారు 2.30 గంటల పాటు జరిగిన రాముల వారి కల్యాణాన్ని భక్తులు కనులారా తిలకించి పరవశమయ్యారు. వైఎస్సార్ సీపీ అనపర్తి నియోజకవర్గం కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆదిలక్ష్మి దంపతులు స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఎమ్మెల్యే దంపతులు వెంట పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి మండ రాజారెడ్డి, వైస్‌ఎంపీపీ ద్వారంపూడి పద్మారెడ్డి, మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ, ఉపసర్పంచ్ మేడపాటి తాతారెడ్డి, జగదీశ్వరరెడ్డి, పప్పు వెంకటరెడ్డి(చక్రి), సబ్బెళ్ల సుధాకర్‌రెడ్డి ఉన్నారు. స్థానిక సూక్ష్మ కళాకారుడు, పీఈటీ ఉపాధ్యాయుడు ద్వారంపూడి యువరాజారెడ్డి బియ్యం గింజలపై శ్రీరామ రామ నామాలు రాసిన బియ్యాన్ని, స్వామి వారికి సమర్పించగా వాటిని కల్యాణంలో వినియోగించారు. గోటితో వలిచిన తలంబ్రాలాను స్థానిక సూర్యనారాయణపురంలో గల వెంకటేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త నల్లమిల్లి గంగిరెడ్డి స్వామివారికి సమర్పించగా వాటిని కల్యాణంలో వినియోగించారు. ఆలయ కమిటీ వారు భక్తులకు ఉచితంగా చేతి విసన కర్రలు అందించారు. కోనేరు వద్ద భారీ అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు. అనపర్తి మండలం పీరా రామచంద్రపురంలో శ్రీరామనవి వేడుకలకు మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి ఆదిలక్ష్మి దంపతులు హాజరయ్యారు. వేడుకల్లో పీటలపై కూర్చొన్న నల్లమిల్లి విక్రమ్‌కుమార్‌రెడ్డి, నల్లమిల్లి వెంకటరెడ్డి దంపతులను మాజీ ఎమ్మెల్యే దంపతులు ఆశీర్వదించారు. కోనాల వెంకటసాయి రామారెడ్డి, తమలంపూడి సత్యనారాయణరెడ్డి, పడాల శ్రీనివాసారెడ్డి, తాడి సీతారామారెడ్డి, తాడి సుధాకర్‌రెడ్డి, నల్లమిల్లి వెంకటరెడ్డి పాల్గొన్నారు. పొలమూరు గ్రామంలో గ్రంథాలయ రాముల వారి ఆలయంలో పీటలపై కొవ్వూరి సతీష్‌రెడ్డి, మహాలక్ష్మి దంపతులు కూర్చున్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు సత్తి గీతా వరలక్ష్మి, సత్తి వెంకటరెడ్డి, సత్తి సూరారెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో..

రంగంపేట: మండలంలోని 17 గ్రామ పంచాయితీల పరిధిలో గల రామాలయాల వద్ద ఆదివారం శ్రీరామనమి కల్యాణ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సీతారాముల ఉత్సవమూర్తులకు పలువురు దంపతులు సంప్రదాయబద్ధంగా కల్యాణం కనుల పండువగా చేశారు. రంగంపేట పాతూరు కోదండ రామాలయం వద్ద కల్యాణ మహోత్సవం చాగంటి పద్మనాభం దంపతుల ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. కల్యాణం అనంతరం భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. రామాలయాల వద్ద చలివిడి, వడ పప్పు, బెల్లపు పానకం, పులిహోర ప్రసాదంగా అందించారు. సామూహిక భజనలు చేసి సీతారాములను దర్శించుకుని ఆరోగ్యాన్ని, ఆనందాన్ని ప్రసాదించాలని భక్తులు కోరుకున్నారు. స్థానిక బీసీ కాలనీ రామాలయం వద్ద జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో గ్రామ మాజీ ఉప సర్పంచ్, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల భజన కళాకారుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు పోతుల వీరన్న ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రామాంజనేయ మహిళా భజన మండలి సభ్యులు ఆయనను సత్కరించారు.

మా ఊరి దేవుడు..అందాల రాముడు

బిక్కవోలు: శ్రీ రామనవమి సందర్భంగా రామాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పందిరి రాట, యజ్ఞోపవీత ధారణ, మంగళ సూత్ర ధారణ, తలంబ్రాలు పోయడం వంటి ఘట్టాలతో కల్యాణ వేడుకను వైభవంగా నిర్వహించారు. ఉత్సవాలను తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. పందలపాక వెలం పేట రామాలయం వద్ద సీతారాముల కల్యాణ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. రామాలయాలను ముస్తాబు చేసి చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. ముందుగా స్వామి ఉత్సవ విగ్రహాలన్ని కాలువ వద్దకి తీసుకువెళ్లి స్నానం చేయించారు. అనంతరం ఊరేగింపుగా ఆలయాల వద్దకు తీసుకు వచ్చారు. అర్చకులు గరిమెళ్ళ సత్యప్రకాష్‌రావు ఆధ్వర్యంలో పైల శ్రీహరి కృష్ణ, అరుణకుమారి దంపతులు కల్యాణ కర్తలుగా వ్యవహరించారు .అనంతరం భారీ ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. మండలంలోని పలు రామాలయాలను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు దర్శించుకున్నారు.

ఎన్ని యుగాలైనా ఆదర్శమూర్తి శ్రీరాముడే



కొండగుంటూరులో సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న జక్కంపూడి రాజా



చినకొండేపూడి రామాలయంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



బూరుగుపూడి బాబా ఆలయంలో దుస్తులు పంపిణీ చేస్తున్న నాయకులు



సాధూపేటలో కల్యాణోత్సవ దృశ్యం

రాజానగరం: ఎన్ని యుగాలు అయినా సమస్త జీవావళి శ్రీరామచంద్రుడినే ఆదర్శమూర్తిగా కొలుస్తారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా రాజానగరం మండలంలోని పాతవెలుగుబంద, కొత్తవెలుగుబంద, కొండగుంటూరులలోని రామాలయాలను సందర్శించి, సీతారాముల కల్యాణోత్సవాలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, ఆయా ఆలయాల కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

సీతానగరం: శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని గ్రామాల్లోని రామాలయాల వద్ద సన్నాయి మేళాలు, బాణసంచా కాల్పులతో శ్రీ సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. చినకొండేపూడి రామాలయంలో దంతులూరి విక్రమరాజు ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం ఘనంగా జరిపారు. పేరిచర్ల వినోద్‌వర్మ, సింధూర దంపతులు, పేరిచర్ల ధర్మతేజ రాజు (రాంబాబు), విజయలక్ష్మి దంపతులు శ్రీసీతారాముల కల్యాణ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. వంగలపూడి రామాలయం వద్ద నీరుకొండ వెంకట నారాయణ, ఉమాదేవి దంపతులు, శ్రీరామనగరం రామాలయంలో కోడి రాజు దంపతులు కార్యక్రమంలో పాల్గొన్నారు. సీతానగరం, లంకూరు, రఘుదేవపురం పెందుర్తివారి రామాలయం, పురుషోత్తపట్నం, రామచంద్రపురం, సింగవరం, నాగంపల్లి, చీపురపల్లి, కూనవరం, ముగ్గళ్ళ, ఇనగంటివారిపేట, వెదుళ్ళపల్లి, రాజంపేట, మునికూడలి, కాటవరం, జాలిమూడి, మిర్తిపాడు, ఉండేశ్వరపురం, బొబ్బిల్లంక, ములకల్లంక గ్రామాలోని రామాలయాల వద్ద శ్రీసీతారాముల కల్యాణం ఘనంగా జరపగా, భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయాల వద్ద అన్నసమారాధన నిర్వహించారు.

రామాలయాలకు భక్తుల రద్దీ

కోరుకొండ: మండలంలోని రామాలయాల వద్ద ఆదివారం శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని కోరుకొండ, బూరుగుపూడి, గాడాల, దోసకాయలపల్లి, గాదరాడ, నర్సాపురం తదితర గ్రామాల్లో నవమి సందర్భంగా భక్తులకు పానకం పంపిణీ చేశారు. రాములవారికి సీతమ్మవారికి కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి పాల్గొన్నారు.

గాదాలలో పానకం పంపిణీ

మండలంలోని గాడాల పెట్రోలుబంకువద్ద గంగాలమ్మవారి ఆలయంవద్ద భక్తులకు పానకం పంపిణీ చేశారు. ఆలయ ధర్మకర్త కొండపల్లి దుర్గారావు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

బాబా ఆలయంలో దుస్తుల పంపిణీ

మండలంలోని బూరుగుపూడి బాబాఆలయంలో వృద్ధులు, మహిళలకు దుస్తులకు పంపిణీచేశారు. ఆలయ ధర్మకర్త మామిడిపల్లి రామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బూరుగుపూడి, గుమ్ములూరు. బుచ్చెంపేట, దోసకాయలపల్లి తదితర గ్రామాలకు చెందిన 272 మంది భక్తులకు దుస్తులు అందజేశారు. బొడ్డు వెంకటరమణచౌదరి బాబాను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కంటే నాగకేశవరావు, నాయకులు కంటే సత్యచక్ర గణపతి, గూడపర్తి పెద్ద, మూతిన శివమోహన్ పాల్గొన్నారు.

సాధూపేటలో కల్యాణోత్సవం

రాజానగరం: దివాన్‌చెరువులోని సాధూపేటలో మహాగపతి యుజవన సేవా సమితి ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణాన్ని ఆదివారం సాయంత్రం అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీరామ నవమి రోజున అన్నిచోట్లా నిర్ణీత సమయంలో సీతారాములకు కల్యాణం జరిపితే ఇక్కడ మాత్రం సాయంత్రం వేళలో ఆరు బయట సంప్రదాయబద్ధంగా నిర్వహించడం గత పదేళ్లుగా జరుగుతోంది. వేరువేరు ఇళ్లలో సీతారాములను పెండ్లి కుమార్తె, పెండ్లి కొడుకులుగా అలంకరించి, ఊరేగింపుగా తీసుకువచ్చి, గ్రామ ప్రముఖుల సమక్షంలో కన్నుల పండువగా కల్యాణం జరిపారు.

లారీలను అడ్డుకున్న జనసేన నాయకులు

సీతానగరం: అక్రమంగా మట్టిని తరలిస్తున్న లారీలను రఘుదేవపురం వద్ద జనసేన నాయకులు అడ్డుకున్నారు. ఆదివారం సాయంత్రం కోరుకొండ మండలం నుంచి మట్టిని తరలిస్తున్న ఆరు లారీలను స్థానిక జనసేన నాయకులు అడ్డుకున్నారు. అనుమతులు ఉంటే చూపించాలని కోరారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఎందుకు మట్టిని తరలిస్తున్నారని నిలదీశారు. రఘుదేవపురంలోని ఇటుక బట్టీలకు మట్టిని తోలుతున్నామని వారు తెలిపారు. స్థానిక ఎస్సై రామ్ కుమార్ దృష్టికి జనసేన నాయకులు తీసుకువెళ్లారు. లారీల డ్రైవర్లు అందించిన పత్రాలను పరిశీలించామని, అనుమతులు ఉండటంతో లారీలను వదిలేశామని ఎస్సై రామ్‌కుమార్ తెలిపారు

జగ్జీవన్‌రామ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్‌ను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని ఆయన మనుమడు డాక్టర్ అన్షుల్ అభిజిత్ అన్నారు. ఆదివారం ఆయన స్థానిక షెల్టాన్ హోటల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో సమిశ్రగూడెం, పెద్దేవం గ్రామాల్లో శనివారం జగ్జీవన్‌రామ్ విగ్రహాలను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఆయన స్వాతంత్ర్య ఉద్యమంలోను, అణగారిన వర్గాల కోసం అనేక ఉద్యమాలలో పాల్గొన్నారన్నారు.